క్లుప్తంగా

ఏకలవ్యుడి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి



ఏకలవ్యుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎరుకుల సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: ఏకలవ్యుడి స్ఫూర్తిని భావితరాలు అందిపుచ్చుకోవాలని ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.ప్రభాకర్ సూచించారు. బుధవారం స్థానిక భాగ్యనగర్‌లోని ఏకలవ్యుడి విగ్రహానికి కులస్తులతో ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎరుకుల కులస్తులు ఏకలవ్యుడి దీక్ష, పట్టుదలను ఆదర్శంగా తీసుకుని అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సేవాసంఘం పట్టణ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, కోశాధికారి నాగరాజు, నాయకులు వరప్రసాద్, నారాయణస్వామి, నాగరాజు, లక్ష్మీనారాయణ, గాదిలింగప్ప పాల్గొన్నారు.

రైతు సంఘం గ్రామ కమిటీల ఏర్పాటు

పుట్లూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏపీ రైతు సంఘం గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఏపీ రైతు సంఘం గ్రామ అధ్యక్షుడిగా రామసుబ్బయ్యతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

23న అశ్వత్థంలో వేలం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, హోటల్ నిర్వహణ హక్కుకోసం ఈ నెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాఘమాసం మినహా మిగిలిన రోజుల్లో మాత్రమే టెంకాయల విక్రయం, హోటల్ నిర్వహణకు అనుమతి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొను వారు ముందుగా రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

గుత్తి కోటను అభివృద్ధి చేయాలి



పర్యాటక శాఖ జిల్లా అధికారి విజయకుమార్ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి కోటను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు తదితరులు జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయకుమార్ బాబుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. గుత్తి కోట ఆర్కాలజీ కార్యాలయం ఆవరణలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా గుత్తి కోటను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని బందార్లపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేష్ (35) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రి నుంచి బందార్లపల్లికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కారు వచ్చి ఢీ కొంది. గాయపడిన అతడిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని కొండూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది వద్ద పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న రెడ్డప్ప బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.12,380 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



పేద విద్యార్థి సురేష్‌కు నగదును అందజేస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

తాడిపత్రి: తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం 15 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేసినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్ తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని దివ్యాంగులకు ప్రతి నెలా సరుకులను పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో అందజేస్తున్నామన్నారు. అలాగే పట్టణానికి చెందిన సురేష్ అనే పేద విద్యార్థి ఐటీఐలో సీటు సాధించడంతో రూ. 20 వేలు ఆర్థిక సాయం చేశామన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘానికి రిటైర్డ్ డీఎస్పీ రామకృష్ణ, సీతా నరసింహులు, లెక్చరర్ కత్తి రామచంద్రారెడ్డి ఒక్కొక్కరు రూ. 10 వేలు చొప్పున నగదును విరాళంగా అందజేశారు.



నార్పల మండలం గూగూడులో భక్తుల పొర్లుదండాలు



గూగూడులో అగ్ని గుండం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి భక్తుల క్యూ

భక్తిశ్రద్ధలతో మొహర్రం

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో బుధవారం హిందూ–ముస్లింలు ఐకమత్యంగా మొహర్రం వేడుకలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పీర్లస్వాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చక్కెర చదివించారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఈ సందర్భంగా యువత చిందేస్తూ అలావ్ తొక్కారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఉత్సవాల్లో భాగంగా కొందరు విచిత్ర వేషధారణలతో అలరించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలో మొహరం వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. వివిధ కాలనీల్లో కొలువుదీరిన పీర్లతో రెడ్డి వీధిలోని పెద్ద మకాన్ వద్ద అలయ్‌బలయ్ నిర్వహించారు. అసేన్, హుసేన్, ఇమామ్ తదితర పీర్లస్వాములు అగ్ని గుండంలో ప్రవేశించి నిప్పులు తొక్కి భక్తిని చాటారు.

గుత్తి: గుత్తిలో బుధవారం మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బారే హిమామ్, బొడ్డు పీర్లు, పగ్గాల పీర్లు, చందమామ పీర్లతో పాటు శ్రీపురం(కొజ్జేపల్లి), లచ్చానపల్లి పీర్లు కూడా గుత్తిలో ఊరేగించారు. అనంతరం పీర్లను భక్తిశ్రద్ధలతో జలధికి తరలించారు.

పామిడి: పామిడిలో 10వ ఖాన్‌ను పురస్కరించుకుని పీర్లస్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం పీర్లస్వాముల సవారీ నిర్వహించారు. రాత్రికి పీర్లస్వాములు జలధికి వెళ్లాయి.

శింగనమల: శింగనమలలో వెండి దేవుడు చావిడి, అక్బర్ చావిడి, గండ్లగండ్ల చావిడి, అసారు కట్ట చావిడి, గొల్లకొండ చావిడి, కొడి పీర్ల, మూడు నాలుకల పీర్ల చావిడి, దడెం పూలు చావిడిలో నిలిపిన పీర్లను ఊరేగించారు. అనంతరం సాయంత్రం జలధికి తరలించారు. అలాగే చిన్నజలాలపురం, గురుగుంట్ల, గోవిందరాయునిపేట, గ్రామాల్లో జలధి కార్యక్రమం నిర్వహించారు.

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల, చెర్లోపల్లి, కడవకల్లు, నాయకునిపల్లి తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. అనంతరం జలధి తరలించారు.



గుంతకల్లులోని ఆంథోని వీధిలో పీర్లస్వాముల ఊరేగింపు



గుత్తిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

యల్లనూరు: మండలంలోని శింగవరం, చింతకాయమండ , కల్లూరు, గొడ్డుమర్రి, తిమ్మంపల్లిలో పీర్లను ఊరేగించారు. ఆయా గ్రామాల పీర్లు సందడి వాతావరణంలో సలాం అందుకున్నాయి.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా 12 గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

తాడిపత్రి రూరల్: మండలంలోని ఊరుచింతల, బ్రహ్మణపల్లి, చుక్కలూరు, సజ్జలదిన్నె,దిగువపల్లి తదితర గ్రామాల్లో జరిగిన పీర్ల ఊరేగింపుల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరులో పీర్లను జలధికి తరలించారు.

పెద్దవడుగూరు: మండలంలోని పెద్దవడుగూరు, బుర్నాకుంట, చిట్టూరు మరో 13 గ్రామాల్లో పీర్లను ఊరేగించి, సాయంత్రం జలధికి తరలించారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు చందన, రాయలచెరువు, పెద్దపేట, వేములపాడు, కమలపాడు, కోనుప్పలపాడు, లక్ష్మంపల్లె, దైవాల మడుగు, రామరాజుపల్లె, తూట్రాళ్లపల్లె తదితర గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. చందన గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకే పెద్దపీరు స్వామితో పాటు మరో 10 స్వాములను గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం రాయలచెరువు నుంచి వచ్చిన పీర్లను చందనలోని పెద్దపీరు స్వామి, చిన్నపీరు స్వామి, బొడ్డు పీరు స్వాముల ఆలింగనం అనంతరం జలధికి తరలించారు.



పామిడిలో హుశేన్, హుశేన్ పీర్లస్వాముల అగ్నిగుండ ప్రవేశం దృశ్యం



శింగనమలలో జలధికి తరలుతున్న పీర్లు



పుట్లూరు మండలం కడవకల్లులో పీర్లతో అగ్ని గుండం దాటుతున్న దృశ్యం



గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో పీర్లు జలధికి వెళ్తున్న దృశ్యం



తాడిపత్రి మండల ఊరుచింతలలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరులో జలధికి తరలుతున్న పీర్లస్వాములు



యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామంలో ఊరేగింపుగా వస్తున్న పీర్లు



పెద్దవడుగూరులో జలధికి తరలివెళ్తున్న పీర్ల స్వాములు



యాడికి మండలం చందనలో పెద్దపీరును ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా తొలి ఏకాదశి



గుంతకల్లులో వేంకపూజలు చేస్తున్న దృశ్యం



పామిడిలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ప్రాకారోత్సవ దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నారాయణ స్వామి, కోశాధికారి సుధాకర్‌గుప్త, రమేష్‌రెడ్డి, జయంతి వెంకట్, సుదర్శన్, రవి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, వీరా తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని తగ్గదేవాలయంలో ఉన్న అనంత గజ గరుడ లక్ష్మీనారాయణస్వామి, చిన్న విఠోబ ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి దేవతామూర్తులను విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం చేశారు. అలాగే స్థానిక చిన్న విఠోబ దేవాలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని అభిషేక, అర్చన, కలశస్థాపన, ధ్వజారోహణ ప్రాకారోత్సవం, నివేదన హారతి గావించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శింగనమల: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని మండలంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శింగనమల, తరిమెల, కల్లుమడి, పెరవలి, నిదనవాడ , సలకంచెరువు గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శింగనమలలో ఆత్మ సీతరాములు, చెన్నకేశవులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దపప్పూరు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం మండలంలో ప్రఖ్యాతి గాంచిన తిమ్మచెరువు లక్ష్మీనరసింహ్మస్వామి ,కుమ్మెత చెన్నకేశవస్వామి, చాగల్లు విరూపాక్షేశ్వర స్వామి, అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధప్రాంతాల నుంచి భక్తులకు తరలివచ్చి అభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.





శింగనమల రామాలయంలో అలంకరణలో ఆత్మసీతారాములు,చెన్నకేశవుడు



పెద్దపప్పూరు: శింగరబట్లు, గణపతి, అశ్వత్థనారాయణుడు

గరుడ వాహనంపై పాండురంగస్వామి



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి



రుక్మిణీ పాండురంగస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పామిడి: పట్టణంలో డబ్బేదార్ ఫిర్కా, రంగసుబే ఫిర్కా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుక్మిణీ పాండురంగస్వామి ఆషాఢ మాస బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా స్థానిక పెద్ద, చిన్న విఠోబ దేవాలయాల్లో రుక్మిణీ పాండురంగ స్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దిండి భజనల నడుమ రుక్మిణీ పాండురంగ స్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంలో ఉంచి ఆలయ ప్రాకారోత్సవం గావించారు. అనంతరం ఆలయం స్వపన తిరుమంజనం నిర్వహించారు. మంత్ర పుష్ప మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితులపై దాడిని అరికట్టండి



బాధితుడిని పరామర్శిస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో దళితులపై దాడులు అరికట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప డిమాండ్ చేశారు. ఇటీవల వైఎస్సార్ జిల్లాలో దాడికి గురైన కదిరి ప్రభాకర్‌ను ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై రోజు రోజుకూ దాడులు పెరిగి పోతున్నాయన్నారు. బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందన్నారు. దళితులపై దాడులు అరికట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందబాబు, కడప నాయకులు రాజేంద్ర, నంద్యాల నాయకుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంలో అపశ్రుతి.. గుండంలో పడిన పీరు



అగ్ని గుండంలో పడిపోయిన పీరు

నార్పల: మండల కేంద్రంలోని మసీదు దగ్గర ఉన్న పీర్ల మకాంలో మొహర్రం సందర్భంగా బుధవారం ఉదయం అగ్నిగుండం ప్రవేశ సమయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వివరాలు.. మొదటి సావిటి వద్ద ఉన్న పీర్ల మకాంలోని ఒక పీరు అగ్ని గుండ ప్రవేశం చేసే సమయంలో.. గుండం మధ్యలో అదుపుతప్పి కింద పడింది. పీరును ఎత్తుకున్న యువకుడిని స్థానికులు అగ్ని గుండం నుంచి బయటకు లాగడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి.

20న ఎగువపల్లిలో కబడ్డీ పోటీలు

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లిలో ఈ నెల 20న ఓపెన్ టోర్న మెంట్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గాలెమ్మ జాతర సందర్భంగా దాతల సహకారంతో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ. 10 వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 9063486242, 6281804406 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ద్వి చక్ర వాహనం చోరీ

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన ఓ భక్తుడి ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పామిడి మండలం పొగరూరు గ్రామానికి చెందిన పెన్నయ్య ద్విచక్ర వాహనంలో మంగళవారం గూగూడు గ్రామానికి వచ్చి పార్కింగ్ చేసి ఆలయం వద్ద నిద్ర చేశాడు. బుధవారం ఉదయం పార్కింగ్ చేసిన ప్రదేశానికి రాగా వాహనం కనిపించలేదు. వెంటనే బాధితుడు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.